సాక్షి తిరుపతి
మంగళవారం, 21, మే, 2024



రంగంలోకి ప్రత్యేక బృందాలు
చంద్రగిరిలో జరిగిన అల్లర్లకు సంబంధించి పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. - 8లో



పొరబాట్లకు తావివ్వొద్దు
భద్రతకు సంబంధించి చిన్న పొరబాట్లకు కూడా తావివ్వొద్దని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. - 8లో



'ఆరోగ్య' సెమినార్
స్విమ్స్‌లోని ఆడిటోరియంలో 'ఆరోగ్య సంరక్షణ రంగంలో 5జీ వినియోగ కేసులు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

తిరుపతి డీఎస్పీగా రవిమనోహరాచారి

తిరుపతి క్రైమ్: తిరుపతి డీఎస్పీగా రవిమనోహరాచారిని నియమిస్తూ ఎలక్షన్ కమిషన్ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. అదేవిధంగా తిరుపతి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా వెంకటాద్రి, స్పెషల్ బ్రాంచ్ సీఐగా విశ్వనాథ్‌చౌదరి, అలిపిరి సీఐగా రామారావును నియమిస్తూ ఉత్తరులు జారీచేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న వారు రెండు రోజుల క్రితమే సస్పెండ్ కావడం తెలిసిందే. ఈ క్రమంలో కొత్తగా నియమితులైన వారు త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

పది సప్లిమెంటరీకి పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో పెంచలకిషోర్

తిరుపతి అర్బన్: జిల్లాలో పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వాహణకు పటిష్టమైన చర్యలు చేపట్టామని డీఆర్వో పెంచలకిషోర్ తెలిపారు. సోమవారం ఆయన పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 5,530 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్టు తెలిపారు. వీరి కోసం 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. మాస్ కాపీయింగ్‌ను నిరోధించేందుకు 2 ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అలాగే ఇంటర్మీడియెట్ సప్లమెంటరీ పరీక్షలు, ఓపెన్ స్కూల్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై కూడా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. డీఈఓ వీ.శేఖర్ మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు జరుగుతాయన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్ గురుస్వామిరెడ్డి, ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జడ్జిలకు శిక్షణా తరగతులు



ప్రసంగిస్తున్న జడ్జి రామ్‌గోపాల్

తిరుపతి లీగల్: రాయలసీమ జిల్లాలోని 30 మంది న్యాయమూర్తులకు సోమవారం శ్వేతభవన్‌లో శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి, ఇన్‌చార్జ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ జీ.రామ్‌గోపాల్ ఈ శిక్షణా తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మధ్యవర్తిత్వం, ఇతర అంశాలపై న్యాయమూర్తులకు అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఎస్‌పీడీ.వెన్నెల, ట్రైనర్లు సుదర్శన్ సుందర్ ప్రసాద్, సుబ్బన్నలు పాల్గొని వివిధ అంశాలపై ప్రసగించారు. కార్యక్రమాన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు.

గంగమ్మా..మమ్మేలు మాయమ్మా!



తిరుపతి తాతయ్యగుంట ఆలయానికి పోటెత్తిన భక్తజనం (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

'గంగమ్మా.. మమ్మేలు మాయమ్మా.. కరుణించు కాపాడు తల్లీ..' అంటూ భక్తులు ప్రణమిల్లారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిని చూసి తరించారు. సంప్రదాయ బద్ధంగా వేషాలు వేసి, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం కైకాల కులస్థులు సున్నపు కుండల వేషాలు వేసి నగర వీధుల్లో విహరిస్తూ స్థానికుల చేత పూజలందుకున్నారు. పలువురు భక్తులు పౌరాణిక, జానపద వేషాలు వేసి, డప్పుదరువులకు చిందు లేస్తూ నందడి చేశారు. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, తిరుపతి నగర మేయర్ దంపతులు అమ్మవారికి సారె సమర్పించారు. సోమవారం అర్ధరాత్రి మంగళ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకం చేశారు.
– తిరుపతి కల్చరల్



తాతయ్యగుంట గంగమ్మకు సారను తీసుకు వస్తున్న మేయర్ డాక్టర్ శిరీష దంపతులు, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్



గంగమ్మతల్లికి సారె సమర్పిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కుటుంబ సభ్యులు

స్నేహం.. సేవామార్గం

సమాజం పట్ల బాధ్యత.. ఉన్నత చదువుకు సార్థకత.. మనసులు కలిపిన భావసారూప్యత.. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన ఐదుగురు స్నేహితులను సేవా మార్గంలోకి తీసుకెళ్లింది. ఉత్తమ ఆశయంతో వారి మదిలో పురుడు పోసుకున్న ఒక్క ఆలోచన వందలాది మందిని ప్రభావితం చేస్తోంది. 'పుత్తూరు జట్టుగా' విశేష సేవలందిస్తూ వేల సంఖ్యలో ఫాలోవర్లను సమకూర్చింది. ఆ మిత్రబృందానికి చక్కటి గుర్తింపు తెచ్చిపెట్టింది.



మన పుత్తూరు టీమ్ మెంబర్స్

- ఇంజినీరింగ్ చదువులకు సార్థకత చేకూరుస్తూ..
- చేయీచేయీ కలిపిన ఐదుగురు మిత్రుల బృందం
- నేడు వేల సంఖ్యలో ఫాలోవర్లతో ప్రత్యేక గుర్తింపు
- 'మన పుత్తూరు' జట్టుగా విశేష సేవలు

మన పుత్తూరు లోగో

పుత్తూరు : ఐదుగురు స్నేహితుల ఆలోచన నుంచి పుట్టిందే 'మన పుత్తూరు జట్టు' సేవా సంఘం. ఇంజినీరింగ్ చదువుతుండగానే వారి ఆలోచనలు సేవా కార్యక్రమాల చుట్టూ పరిభ్రమించాయి. వీరి ఆశయాలకు 2018లో నాంది పడింది. ముందుగా వారు తమ ఆలోచనలను పుత్తూరు పట్టణంలోని మరి కొంతమందితో పంచుకొన్నారు. అందరూ చేతులు కలిపారు. నాటి నుంచి నేటి వరకు నిర్విరామంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తమ సంఘం తరఫున చేపట్టిన పనులను ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం వీరికి 26 వేల మంది ఫాలోవర్స్ ఉన్నారు. సేవా కార్యక్రమాలను నిర్వహించే ఓ సంఘానికి వేల సంఖ్యలో ఫాలోవర్స్ ఉండడం విశేషం. మన పుత్తూరు పేరిట ఓ పిలుపునిస్తే పదుల సంఖ్యలో యువకులు కదలివచ్చి కార్యక్రమం విజయవంతానికి తమ వంతు సహకారం అందిస్తున్నారు. దీంతో రెట్టించిన ఉత్సాహంతో మన పుత్తూరు సంఘం సభ్యులు ముమ్మరంగా సేవలు అందిస్తున్నారు. వాటిలో మచ్చుకు కొన్ని..



చెత్త సేకరిస్తున్న సభ్యులు

- ఓటు హక్కు వినియోగంపై వీడియోలు తీసి గ్రామీణులకు అవగాహన కల్పించారు.
- చిన్న చిన్న సమస్యలకు అధికారులపై ఆధారపడే పరిస్థితి లేకుండా స్వయంగా తామే రంగంలోకి దిగి పరిష్కరించారు.
- పుత్తూరు పట్టణంలో విశేషంగా నిర్వహించే శ్రీధర్మరాజస్వామి తిరునాళ్లల్లో సేవా కార్యక్రమాలు చేశారు.
- పుత్తూరు పట్టణం ప్రత్యేకతలు తెలుపుతూ, చుట్టు పక్కల ఉన్న జలపాతాలు, ఇతర ప్రత్యేకతలను డ్రోన్ కెమెరా ద్వారా చిత్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేశారు.
- కోవిడ్ సమయంలోనూ ప్రతిరోజూ సమాచారాన్ని న్యూస్ వీడియోల ద్వారా ప్రజలకు – తెలియజేశారు.
- యూ ట్యూబ్ చానెల్‌లో పుత్తూరు మేధ అనే పాటను చిత్రీకరించి పోస్ట్ చేయడంతో బాగా వైరల్ – అయ్యింది.
- ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు 7 హెడ్‌లైన్స్ ద్వారా వార్తలను స్థానికులకు తెలియజేస్తున్నారు.



చెత్త బస్తాలతో పుత్తూరు టీమ్ సభ్యులు



రోడ్డు డివైడర్లను ఏర్పాటు చేస్తూ..

సామాజిక సేవే లక్ష్యం



మన పుత్తూరు పేరిట సామాజిక సేవలను విస్తృతం చేయడమే మా లక్ష్యం. మన పుత్తూరు టీమ్‌ను నా మిత్రులు పవన్‌కుమార్, సాయిగౌతమ్, కల్యాణ్ కుమార్, కృష్ణచైతన్యలతో కలిసి నడిపిస్తున్నా. అందరం ఇంజినీరింగ్ చదివేప్పుడు మిత్రులమయ్యాం. ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్నా మన పుత్తూరుకు తగిన సమయం కేటాయిస్తున్నాం. ఫలానా చోట మీ సేవ అవసరం అని మా దృష్టికి తీసుకు వస్తే తప్పుకుండా మావంతు పనిచేస్తాం. ఇందుకు మా టీమ్ అన్ని వేళలా సిద్ధం. ప్రధానంగా పుత్తూరు గురించి గుగూల్ మ్యాప్స్, నెట్‌లోనే కాకుండా మా ఇన్‌స్టాగ్రామ్ పేజీ చూస్తే ఇక్కడి ప్రత్యేకతలు తెలిసేలా ప్రయత్నిస్తున్నాం.
– గిరీష్ కుమార్, మన పుత్తూరు టీమ్ అడ్మిన్

'మూలకోన' పరిరక్షణ

పుత్తూరు మండలంలోని మూలకోన పర్యాటకులకు నెలవు. వారాంతాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులే కాకుండా తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. దీంతో ఇక్కడ పరిశుభ్రత తలకు మించిన భారంగా తయారైంది. ఈ విషయాన్ని గుర్తించిన మన పుత్తూరు సభ్యులు 40 మంది మూలకోనకు చేరుకొని గత కొన్నేళ్లుగా పారిశుద్ధ్యం మెరగునకు చర్యలు చేపడుతున్నారు. రోజూ పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నారు. రాళ్ల, రప్పల మధ్య, ఆలయ ప్రంగణంలోని కోనేరు, కొండపైన జలపాతం వద్ద 24 గంటల పాటు శ్రమించి ఈ ఆదివారం ఒక్కరోజే 130 బస్తాల వ్యర్థాలను తొలగించారు. వీరి కష్టానికి ఫలితంగా మూలకోన చాలా కాలం తర్వాత పరిశుభ్రతను సంతరించుకుంది.



మూలకోన కోనేరులో వల సహాయంతో చెత్త సేకరణ



ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న సభ్యులు

సకల దేవతలకు ఆహ్వానం

- ఆగమోక్తంగా ధ్వజారోహణం
- నృశింహుని బ్రహ్మోత్సవాలకు పోటెత్తిన జనం



ధ్వజ స్తంభం వద్ద గరుత్మంతునికి హారతి ఇస్తున్న అర్చకులు



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు



దేవేరులతో కలిసి శేష వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన క్షేత్రంలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఆగమోక్తంగా చేపట్టారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజపటాన్ని ఎగురవేశారు. ఉదయం దేవదేవేరులకు ఉభయదాతలు పట్టువస్త్రాలు సమర్పించారు. తర్వాత శ్రీవారు, ఆదిలక్ష్మీ అమ్మవారు, ఆంజనేయ స్వామివార్లకు ప్రత్యేక పూలంగి సేవ జరిపించారు. అనంతరం దేవదేవేరులను, గరుత్మంతుడి చిత్రపటాన్ని తిరుచ్చిపీఠం పై కొలువుదీర్చి ఆలయంలో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. తిరుచ్చిపై కొలువు దీరిన స్వామివారు కోనలోని నాలుగు మాడ వీధుల్లో విహరించారు. అక్కడి నుంచి ధ్వజస్తంభం వద్దకు చేరుకుని అర్చకులు గరుత్మంతుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభానికి అభిషేకాలు నిర్వహించి ధ్వజపటాన్ని ధ్వజ స్తంభంపైకి ఎగురవేసినారు. డీసీ సాగర్‌బాబు, చెంగాళమ్మదేవస్థానం ఏసీ వెంకటేశ్వర్లు, ఉప ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి, టీటీడీ పాంచరాత్ర ఆగమపండితులు రామానుజాచార్యులు పాల్గొన్నారు.

అ'శేష'భక్తజనం

రాత్రి పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవేరులతో కలిసి శేష వాహనంపై ఊరేరుగూ స్వా మివారు కనువిందు చేశారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో నేడు

పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం హంస వాహనసేవ, రాత్రి 10 గంటలకు బంగారు హనుమంత వాహనంపై శ్రీవారి క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

కొడిముద్దల కోసం పోటీ

ధ్వజారోహణానికి ఎంతో విశిష్టత ఉంది. గరుత్మంతుడికి పూజలు, అభిషేకాలకు ఉపయోగించిన ప్రసాదాలను స్వీకరిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. దీంతో ఈ ప్రసాదం కోసం మహిళలు పోటీపడ్డారు. స్నపన తిరుమంజనం కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. దేవదేవేరులను తిరుచ్చిలో కొలువుదీర్చి 1008 సహస్రదీపాలంకరణ మండపంలో ఉంచి ఊంజల్‌సేవ నిర్వహించారు.

23న వైశాఖి పౌర్ణమి గరుడసేవ

తిరుమల: తిరుమలలో మే 23న వైశాఖ పౌర్ణమి గరుడసేవ వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా తిరుమలలో గరుడసేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడ వాహనంపై అధిష్టించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు.

క్లుప్తంగా

వైఎస్ఆర్ సీపీ నుంచి ఎంఆర్‌సీ రెడ్డి సస్పెన్షన్



తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంఆర్‌సీ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన ఎంఆర్‌సీ రెడ్డిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. ఆయన పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వ్యతిరేకంగా, ప్రత్యర్థి పార్టీ నాయకులకు అనుకూలంగా పనిచేశారన్న ఆరోపణలతో విచారణ జరిపి క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు సస్పెండ్ చేసినట్లు ప్రకటించింది.

శ్రీవారి సేవలో చదరంగం క్రీడాకారుడు



ఆలయం ఎదుట దొమ్మరాజు గుకేష్

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం భారత చదరంగపు క్రీడాకారుడు దొమ్మరాజు గుకేష్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

రంగంలోకి ప్రత్యేక బృందాలు

- కూచువారిపల్లె ఘటనలో కొత్త ట్విస్ట్
- పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు

చంద్రగిరి: సార్వత్రిక ఎన్నికల ఓటమి ఖాయం అని నిర్ణయించుకున్న టీడీపీ గుండాలు గత సోమవారం రాత్రి మండల పరిధిలోని రామిరెడ్డిపల్లి పంచాయతీ కూచువారిపల్లిలో చేసిన విధ్వంసకాండ అందరికీ తెలిసిన విషయమే. టీడీపీ రౌడీల దాష్టికంలో వాహనాలు దగ్ధం కావడంతో పాటు సర్పంచ్ ఇంటికి సైతం నిప్పటించారు. దీనిపై సీరియస్ అయిన కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే క్షేత్ర స్థాయి పరిశీలన చేసి నిజానిజాలను వెలికి తీయాలని ఆదేశాలు జారీచేసింది. దీంతో సిట్ అధికారులు కూచువారిపల్లి, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించి క్షేత్ర స్థాయిలో పరిశీలను చేశారు. అనంతరం గ్రామస్తుల వాగ్మూలాలను రికార్డు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో నమోదు చేసిన కేసుల వివరాలనుపరిశీలించి, పలు సూచనలు చేశారు.

నిందితుల కోసం ప్రత్యేక బృందాలు?

విధ్వంసానికి కారణమైన టీడీపీ రౌడీలపై ఇప్పటికే పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే పథకం ప్రకారం దాడులు, దౌర్జన్యాలకు పాల్పడిన టీడీపీ అల్లరి మూకలు పరారీలో ఉన్నారు. కేసులు నమోదు చేసి నాలుగు రోజులకు పైగా అవుతున్నా ఇంతవరకు ఒక్కరినీ అదుపులోకి తీసుకోలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం పరిశీలన చేసిన సిట్ అధికారులు, పోలీసులపై కూడా పలు ప్రశ్నలు సంధించారు. వారి ఆదేశాలతో నిందితులను పట్టుకోవడానికి రెండు ప్రత్యేక బృందాలను సైతం సిద్ధం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. నేరానికి పాల్పడిన టీడీపీ గుండాలు ఇప్పటికే చెన్నై, బెంగళూరు, గోవా, హైదరాబాద్ లాంటి ప్రదేశాలకు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. వారి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

వీడియో ఆధారంగా మరికొన్ని కేసులు

కూచువారిపల్లి దాడి, ఇల్లు దగ్ధం, కారుకు నిప్పు పెట్టడం వంటి కేసుల్లో మరికొందరిపై కూడా కేసులు నమోదైనట్లు సమాచారం. ఈ మేరకు సిట్ బృందం సభ్యులు కూడా పోలీసు శాఖకు ఆదేశాలు జారీచేసినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలోని వీడియో ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించి, వారిపై కూడా కేసులు నమోదు చేసి అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. గ్రామస్తులతోపాటు తిరుపతి, చిత్తూరు, ఇతర ప్రాంతాలకు చెందిన వారు సైతం ఈ దాడుల్లో పాల్గొన్నట్లు అధికారులు గుర్తించినట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో వీడియోలోని వారిని గుర్తించి వారిపై కూడా కేసులు నమోదు చేయడంతో పాటు అరెస్టుకు సైతం పోలీసు శాఖ రంగం సిద్ధం చేస్తోంది. మరో రెండు, మూడు రోజుల్లో నిందితులను పోలీసులు అరెస్టు చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లుగా సమాచారం.



కూచువారిపల్లిలో దగ్ధమైన సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని పరిశీలించి వస్తున్న సిట్ బృందం సభ్యులు(ఫైల్)

ఫలితం ఏది ముందు..?

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి కౌంటింగ్‌పై పడింది. జూన్ 04న ఎన్నికల కౌంటింగ్ ఉండడంతో ఏ నియోజకవర్గ ఫలితం ముందుగా వస్తుంది.. ఏది ఆలస్యమవుతుందనే చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉదయం 8 గంటలకు, ఈవీఎంలను ఉదయం 8.30 గంటలకు లెక్కించనున్నారు. జిల్లాలో మొత్తం 2,140 పోలింగ్ కేంద్రాలుండగా.. ఆ ప్రకారం టేబుల్స్ ఏర్పాటు చేశారు.

అసెంబ్లీ	పోలింగ్ కేంద్రాలు	టేబుల్స్	రౌండ్లు
గూడూరు	294	14	21
సూళ్లూరుపేట	304	14	22
వెంకటగిరి	299	14	21
చంద్రగిరి	397	20	20
తిరుపతి	274	14	20
శ్రీకాళహస్తి	293	14	21
సత్యవేడు	279	14	20

పెరిగిన ఓటింగ్ 0.15 శాతమే

తిరుపతి అర్బన్: ఈ సారి సార్వత్రిక ఎన్నికల్లో గతంలో కంటే 0.15 శాతం ఓటింగ్ పెరిగింది. 2019 ఎన్నికల్లో జిల్లాలో 78.48 శాతం ఓట్లు పోలవ్వగా.. ఈ సారి 78.63 శాతం ఓట్లు పోలయ్యాయి. తిరుపతి అసెంబ్లీ పరిధిలో 2019లో 65.92 శాతం ఓటింగ్ నమోదవ్వగా.. ఈ సారి 63.32 శాతం మంది మాత్రమే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

అసెంబ్లీ నియోజకవర్గం	2019లో పోలింగ్ శాతం	2024లో పోలింగ్ శాతం
గూడూరు	78.12	78.89
సూళ్లూరుపేట	82.86	82.92
వెంకటగిరి	78.56	80.87
చంద్రగిరి	78.13	79.89
తిరుపతి	65.92	63.32
శ్రీకాళహస్తి	82.46	83.25
సత్యవేడు	86.45	85.28
మొత్తం	78.48	78.63

ఎర్రచందనం గోదాముల్లో కూలీకి గాయాలు

తిరుపతి మంగళం: తిరుపతి నగరపరిధిలో తిమ్మినాయుడుపాళెం సమీపంలోని కేంద్రీయ ఎర్రచందనం గోదాముల్లో సోమవారం కూలీ సారమ్మ తీవ్రంగా గాయపడింది. ఆమెను అధికారులు ఎర్రచందనం గోదాముల్లో భద్రపరిచిన ఎర్రచందనం దుంగలకు డ్రెస్సింగ్ చేసే పనుల్లో సహాయకురాలిగా పని చేసేందుకు తీసుకొచ్చారు. అయితే ఆమెతో కోత యంత్రంతో ఎర్రచందనం దుంగలను కోసే పని అప్పజెప్పారు. ఆమె ఆ యంత్రాన్ని అదుపుచేయలేకపోవడంతో కాలికి బలమైన గాయం తగిలింది. సిబ్బంది వెంటనే ఆమెను రెడ్డిగుంట సమీపంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

పట్టాలపై వ్యక్తి మృతదేహం

పాకాల: రైలు పట్టాలపై ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సోమవారం ఊట్లవారిపల్లికి సమీపంలోని పాకాల–పూతలపట్టు మార్గ మధ్యంలో చోటు చేసుకుంది. మృతుని వయసు 40 ఏళ్ల ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు ప్రయాణిస్తున్న రైలు నుంచి జారి పడ్డాడా..? లేక రైలు ఢీకొని మృతిచెందాడా.. తెలియరాలేదు. మృతుడి శరీరంపై నలుపు రంగు లోయర్, బులుగు రంగు చెక్స్ చొక్కా, మెడలో స్టీల్ గొలుసు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అంతర్జాతీయ ఆర్చరీ పోటీలకు
నాయుడుపేట క్రీడాకారుడు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణానికి చెందిన హరిప్రసాద్, సుప్రియ దంపతుల కుమారుడు గణేష్ మణిరత్నం అంతర్జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు. దక్షిణ కోరియా దేశంలోని సువాన్‌లో జూన్ 2 నుంచి 9వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ స్థాయి ఆర్చరీ 2024 ఆసియా కప్ పోటీల్లో పాల్గొననున్నట్టు కోచ్ కమల్‌కిషోర్ తెలిపారు. గణేష్ మణిరత్నం ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో జరిగిన ఆర్చరీ పోటీల్లో పాల్గొని ఇప్పటి వరకు 5 బంగారు పతకాలు, 6 రజిత పతకాలను సాధించినట్లు తెలిపారు. గత ఏడాది ఐర్లాండ్‌లో జరిగిన ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో రజిత పతకం సాధించినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో ఆర్చరీ అసోసియేసన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హర్యానా రాష్ట్రంలోని సోనిపేట కేంద్రంగా గత నెల 21వ తేదీ నుంచి జరిగిన 2024 ఆసియా కప్ ఎంపిక పోటీల్లో మణిరత్నం అర్హత సాధించి కోరియా దేశంలో జరిగే అంతర్జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు భారతదేశం తరఫున ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్చరీ అసోసియేసన్ ఆఫ్ ఇండియా ఢిల్లీ కేంద్రంగా మణిరత్నంకు 15 రోజులు ప్రత్యేక శిక్షణ ఇవ్వనుందని వివరించారు. క్రీడాకారుడిని ఏపీ ఆర్చరీ సంఘం కార్యదర్శి సత్యనారాయణ అభినందించారు.



కోచ్ కమల్‌కిషోర్‌తో గణేష్ మణిరత్నం

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాయుడుపేట టౌన్: నాయుడుపేట రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. రైల్వేపోలీసుల కథనం.. రైల్వేస్టేషన్ ఎగువ మార్గంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఛిద్రమై పడి ఉండడాన్ని కీమన్ గుర్తించి రైల్వే స్టేషన్ మేనేజర్‌కు సమాచారం అందించారు. ఈ విషయమై సూళ్లూరుపేట రైల్వే ఇన్‌చార్జ్ ఎస్‌ఐ మాలకొండయ్య, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొన్నట్లు గుర్తించారు. హైదారాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదు. మృతుని వయస్సు సుమారు 25 నుంచి 30 ఏళ్ల లోపు ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. నీలం రంగు జీన్స్ ప్యాంటు, తెలుపు రంగు చొక్కా ధరించినట్లు వెల్లడించారు. మృతునికి సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే 95732 45266కు సమాచారం అందించాలని కోరారు.

డాక్టర్ నిర్లక్ష్యం వల్లే
శిశువు మృతి?

- ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన



మృతి చెందిన శిశువు

వాకాడు: ఓ డాక్టర్ నిర్లక్ష్యం కారణంగా గర్భస్థ శిశువు మృతి చెందిన ఘటన సోమవారం వాకాడు మండలం, నిడిగుర్తి పీహెచ్‌సీలో చోటుచేసుకుంది. బాధితుల వివరాలు.. మండలంలోని నలగామాల గ్రామానికి చెందిన 9 నెలల గర్భవతి ముంగర వాసంతి శనివారం రాత్రి పురిటి నొప్పులతో తన భర్త చెంచురెడ్డిని వెంటబెట్టుకని నిడిగుర్తి పీహెచ్‌సీకి వెళ్లింది. అక్కడ పరిస్థితిని బట్టి వైద్యుని సలహా తీసుకుని పట్టణ ప్రాంతంలోని మరో ఆస్పత్రికి వెళ్లాలని అనుకుంది. అయితే వైద్యుడు రామకృష్ణ మాత్రం వాసంతికి ఇక్కడే సుఖ ప్రసవం జరుగుతుందని శనివారం నుంచి ఆదివారం రాత్రి వరకు కుటుంబ సభ్యులకు చెప్పుకుంటూ వచ్చాడు. చివరకు సోమవారం తెల్లవారు జామున శిశువు గర్భంలోనే మృతి చెందిందని, తల్లికి ఏమీ కాలేదని డాక్టర్ బుకాయించాడు. దీంతో గ్రామస్తులు, వాసంతి బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. డాక్టర్ నిర్లక్ష్యం వల్లే శిశువు మృతిచెందిందని ఆరోపించారు. దీనిపై డాక్టర్ రామకృష్ణను వివరణ కోరడానికి ఫోన్ చేస్తే అవుట్ ఆఫ్ కవరేజ్ మోడులో ఉంది.

ఘనంగా జాబ్ అచీవర్స్ డే



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపల్ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్: చదువుకునే సమయంలోనే అంది వచ్చిన ఉద్యోగావకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ బ్యూరో టీ.శ్రీనివాసులు సూచించారు. తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం జాబ్ అచీవర్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. చదువుతో పాటు విద్యార్థులు ఉద్యోగ సాధనకు సంబంధించిన నైపుణ్యాలపై దృష్టి సారించాలన్నారు. అలాగే కళాశాలల్లో నిర్వహించే ప్రతి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో పాల్గొనాలని సూచించారు. బీటెక్ విద్యార్థులతో పోలిస్తే డిప్లొమో చేసిన విద్యార్థులకే ఉద్యోగావకాశాలు అధికమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ 2023–24 విద్యాసంవత్సరంలో వివిధ సంస్థలు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించాయని, ఇందులో వివిధ బ్రాంచ్‌లలో ఫైనలియర్ చదువుతున్న తమ విద్యార్థులు 201మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా ఆఫర్ లెటర్స్‌ను అందించారు. జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్వీ.గౌరీశంకర్, టీపీఓ ఏ.ధనంజయ పాల్గొన్నారు.

పొరబాట్లకు తావివ్వొద్దు

తిరుపతి అర్బన్: భద్రతకు సంబంధించి చిన్న పొరబాట్లకు కూడా తావివ్వొద్దని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన సోమవారం రాత్రి తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముందుగా విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేసిన తర్వాతే పరిశీలించారు. ఐదంచెల భద్రతకు సంబంధించి ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేపడుతున్నట్టు వెల్లడించారు.

'ఆరోగ్య' సెమినార్

తిరుపతి తుడా : స్విమ్స్‌లోని ట్రాయ్ ఆడిటోరియంలో 'ఆరోగ్య సంరక్షణ రంగంలో 5జీ వినియోగ కేసులు' అనే అంశంపై సోమవారం సెమినార్ నిర్వహించారు. ట్రాయ్ చైర్మన్ అనిల్‌కుమార్ లాహోటి, టీటీడీ జేఈఓ గౌతమి స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా.ఆర్వీ.కుమార్, ట్రాయ్ సెక్రటరీ రఘునందన్, శ్రీ రాజరెడ్డి, రీజినల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, జ్యోతిని వెలిగించి కార్యకమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాయ్ ముఖ్యమైన లక్ష్యాలపై అవగాహన కల్పించారు. విద్య–ఆరోగ్య సంరక్షణ రంగాలలో 5జీ ప్రాముఖ్యత, స్థిరమైన అభివృద్ధికి డిజిటల్ ఆవిష్కరణల గురించి వివరించారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి



మృతి చెందిన అయిషా సమీన

నారాయణవనం: మండలంలోని గోవిందప్ప నాయుడుక కండ్రిగ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రేణిగుంటకు చెందిన అయిషా సమీన(10) మృతి చెందింది. ఈ ప్రమాదంలోనే పలువురు గాయపడ్డారు. రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. రేణిగుంట బుగ్గవీధికి చెందిన రజాక్‌అహమద్ కుటుంబ సభ్యులతో కలిసి నాగలాపురం మండలం, టీపీ కోటలో జరిగిన ఓ వేడుకకు హాజరయ్యారు. తర్వాత కారులో సోమవారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. మండలంలోని గోవిందప్పనాయుడుకండ్రిగ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ వద్దకు చేరుకునే సరికి అదే సమయంలో చెన్నై వైపుగా వెళ్తున్న గుర్తుతెలియని కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రజాక్ అహమద్(35), అతని భార్య యస్మిన్(29), కుమార్తె అయిషా సమీన(10, కుమారులు షాదిక్ అహమద్(8), రెహ్మాన్ అహమద్(1), కారు డ్రైవర్ బషీర్(58) గాయపడ్డారు. వీరిని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా.. మార్గ మధ్యంలో అయిషా సమీన మృతి చెందింది. యస్మీన్ కాలు, చెయి విరిగిపోయాయి. క్షతగాత్రులకు పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జయరాం నాయక్ తెలిపారు.